విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 07, ఫిబ్రవరి 2024

ఉద్యోగ,ఉపాధ్యాయ డిమాండ్ల సాధన కోసం ఉద్యమిద్దాం..!

ఏపీఎన్జీవో సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర- బనగానపల్లె : ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ దారుల న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం ఉమ్మడి కర్నూలు,నంద్యాల జిల్లా ఏపీఎన్జీవోస్ అధ్యక్షుడు సిహెచ్ వెంగళరెడ్డి ఆదేశాల మేరకు13 తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల తో ఏపీ జె ఏ సి ఉద్యమం చేపడుతున్నట్లు ఏపీఎన్జీవో బనగానపల్లె అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక డిగ్రీ కాలేజీ ఆవరణలో ఏపీఎన్జీవో అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు , సెక్రెటరీ ఎస్ అల్తా హుస్సేన్ ఫ్యాన్ సెక్రెటరీ ఎస్ దాదావలి, ఉద్యోగ సంఘ నాయకుల నాయకత్వంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐఆర్, సరెండర్ లీవ్స్, జీపిఎఫ్ ఏపీజీ ఎల్ ఐ క్లెయిమ్స్, డీఏ, అరియర్స్, పీఆర్సీ అరియర్స్, మెడికల్ రిక్వైర్మెంట్స్ బిల్స్ ఇచ్చే వరకు దశల వారి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఈనెల 11న జరిగే రాష్ట్ర జేఏసీ లో అన్ని భాగ స్వామ్య సంఘాల ఏకాభిప్రాయంతో సమిష్టి నిర్ణయం చేసి12 న చీఫ్ సెక్రటరీకి నోటీస్ ఇస్తామన్నారు. 13 తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఉద్యమం చేస్తారన్నారు.

వెదురు వేలం పాటల్లో రూ.9.95 లక్షల ఆదాయం

విశాలాంధ్ర-రుద్రవరం: మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో మంగళ వారం నిర్వహించిన వెదురు వేలం పాటల్లో ప్రభుత్వానికి రూ.9, 95,400లు ఆదాయం చేకూరిందని సీఎం, ఎఫ్‌డిపిటి, బి ఎస్ మూర్తి,డిఎఫ్ఓ అనురాగ్ మీనా లు తెలిపారు.

ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాల మేరకు రెండో రకం వెదురు 13,500, మూడో రకం వెదురు 27,000 మొత్తం 40,500 వెదుర్లకు వేలం పాటలు నిర్వహించామన్నారు. అలాగే మూడు టింబర్ లాట్లను వేలం నిర్వహించగా రూ. 12,500 ఆదాయం వచ్చిందన్నారు. ఈ వేలం పాటల్లో ఇంచార్జి రేంజ్ ఆఫీసర్, ఈశ్వరయ్య, డిప్యూటీ రేంజర్ ముత్తుజ, డిపో ఫారెస్టర్ నాగరాజు, నూతల సెక్షన్ ఫారెస్టర్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఎన్నికల కేంద్రాల పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర -పాణ్యం : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల భద్రతారూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు పరిశీలించారు. మంగళవారం మండల పరిధి లోని ఆర్జియం ఇంజనీరింగ్ కాలేజీ, శాంతిరాం ఫార్మసీ అండ్ ఇంజనీరింగ్ కాలేజీ, పట్టణంలోని సిడబ్లుసి గోడౌన్ లోని భవనాలను జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పోలింగ్ పిదప ఈవీఎంల భద్రతా భవనాలు, ఓట్లలెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలు పరిశీలించారు. ఒక్కో నియోజకవర్గానికి అసెంబ్లీకి రెండు భవనాలు, పార్లమెంట్ కు రెండు భవనాలు చొప్పున నాలుగు భవనాలు, ఆరు నియోజకవర్గాలకు 24 భవనాలు

అవసరమవుతాయని గుర్తించారు. వీటితో పాటు అన్ని నియోజక వర్గాల పోలింగ్ సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి అవసరమయ్యే భవనాలను కూడా పరిశీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.

వీరి వెంట సబ్ డివిజన్ డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్డిఓ మల్లికార్జునరెడ్డి,డి.ఎస్.ఓ.వెంకట్రాముడు, నంద్యాల, పాణ్యం తహసీల్దార్లు చంద్రశేఖర్‌రెడ్డి, ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-చాగలమర్రి : 35వ జాతీయ రహదారి భద్రతా మాసో త్సవాల సందర్భంగా 40 వ జాతీయ రహదారిపై గల స్థానిక టోల్ ప్లాజా ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని టోల్‌ప్లాజా హెడ్ మదన్ మోహన్,ప్రాజెక్ట్ మేనేజర్ అరుణ్‌రాజ్,టోల్ ప్లాజా మేనేజర్ పరదీప్ మాలిక్,మేనేజర్ యాకుబ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కడప పుష్పగిరి కంటి వైద్యశాల వైద్య నిపుణురాలు అమృత రహదారిపై ప్రయాణించే సుమారు 200 మంది ప్రయాణీకులకు,వాహనదారులకు కంటిపరీక్షలునిర్వహించి మందులను ఉచితంగా అందజేసారు. అనంతరం టోల్ ప్లాజా అధికారులు మాట్లాడుతూ టోల్ ప్లాజా ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పారా మెడికల్ వైద్య సహాయకులు అబ్దుల్ కళాం,టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికే నియంత్రికలు ఏర్పాటు

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : పట్టణంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని లో- వోల్టేజ్ సమస్య నివారించుట కొరకు సుమారు రూ.31 లక్షలతో కొత్తగా ఐదు నియంత్రికలు ఏర్పాటు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో, కూరగాయల మార్కెట్, నాగులకట్ట, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు కోవెలకుంట్ల రోడ్డులో ఈ విద్యుత్తు నియంత్రికలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యుత్‌శాఖ డీఈఈ రవికాంత్ చౌదరి, ఏఈ హుస్సేన్ బాషలు మాట్లాడుతూ విద్యుత్ సబ్ డివిజన్ ని వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి తమకు సహకరించాలన్నారు. కరెంటు బిల్లు ఇచ్చినరోజు నుంచి 14 రోజుల్లో బిల్లులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్మెన్ క్టర్ రమణయ్య మరియు అమీర్ భాష ఫోర్ మెన్ ప్రతాప్, లైన్మెన్లు నాగరాజు, ఖలీల్, సుబ్బారావు, నజీర్ కాంట్రాక్టర్ రాము మరియు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లస్టర్, బూత్ కన్వీనర్లు ఓటర్లకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర - నంద్యాల : క్లస్టర్, బూత్ కన్వీనర్లు ఓటర్లకు అందుబాటులో ఉండాలని టీడీపీ నంద్యాల ఇంచార్జ్ ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయం నందు నిర్వహించిన క్లస్టర్, యూనిట్ బూత్ కన్వీనర్లతో జిల్లా పార్టీ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, మాజీ మంత్రి, టీడీపీ నంద్యాల ఇంచార్జ్ ఎన్ఎండి ఫరూక్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తెలుగుదేశంపార్టీబూత్ కన్వీనర్లు ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బూత్ కన్వీనర్లు కొత్తగా వచ్చిన ఓటర్లజాబితాలు క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి ఓటు గుర్తించి ఓటర్లకు ప్రతిక్షణం అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుల ఓట్లు ఎప్పటికప్పుడు చెక్ చేస్తుండాలని బూతుల వారీగా ఓటర్లను గుర్తించి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ ద్వారా అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చే సంక్షేమ పథకాలు ఓటర్లకు వివరించాల్సిన భాద్యత బూత్ కన్వీనర్లదేనని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జిల్లెల శ్రీరాములు, కౌన్సిలర్ జైనాబ్‌బీ, మాజీ కౌన్సిలర్లు కృపాకర్, శివశంకర్, కరిముల్లా, నాయకులు కార్యకర్తలు క్లస్టర్, యూనిట్ బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

చీకటిలో రైల్వే ప్రయాణికుల ప్రయాణం

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె రైల్వే స్టేషన్ పట్టణ శివారులోని టంగుటూరు నంద్యాల గల రహదారి ప్రక్కన ఏర్పాటు చేయడం జరిగింది. టంగుటూరు ప్రధాన రహదారి నుండి ఎడమ వైపు అర కిలో మీటర్ మేర స్టేషన్‌కు వెళ్లేందుకు రహదారిని ఏర్పాటు చేయకపోగా రాత్రిపూట చీకటిలో ప్రయాణం చేయవలసి వస్తుందని రైల్వే ప్రయాణికులు వాపోతున్నారు. మట్టి రహదారి గుంతలు మయంగా ఉండడంతో బైకులపై ,కాలి నడకన వెళ్లేవారు చీకటిలో ప్రమాదాలు గురవుతున్నారని అధికారులు వెంటనే స్పందించి రహదారితో పాటు లైట్లు వేయాలని రైల్వే ప్రయాణికులు కోరుతున్నారు.

టీడీపీ చేసిన అభివృద్ధి శూన్యం

విశాలాంధ్ర-నంద్యాల రూరల్ : 40 ఏళ్ల రాజకీయంగా సామాజికంగా చంద్రబాబు అభివృద్ధి ఏమి చేసింది లేదని అలాగే ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు అధికారంలో ఉన్న రాష్ట్రాభివృద్ధి ఏమి లేదని నంద్యాల వైసీపీ సోషల్ మీడియా ఇన్చార్జి దూదేకుల కాసిం విమర్శించారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయం నందు విలేకరులతో మాట్లాడుతూ ఈరోజు వైసీపీ ప్రభుత్వంలో ఓల్డ్‌టౌన్ ఎంతగా పురోగతి చెందిందో మీరే చూసారు.

పోతులపాడులో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ

విశాలాంధ్ర -జూపాడుబంగ్లా: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే పేద బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గిత్త జయసూర్య అన్నారు . మంగళవారం మండలంలోని పోతులపాడు గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని గ్రామ మాజీ సర్పంచ్ రవికాంత్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం, ఇసుక ,స్కాములు చేస్తూ వైసిపి నాయకుల వారి జేబులు నింపుకుంటున్నారని వారు ఆరోపించారు. దళిత పేద విద్యార్థులను యువతను నిరుద్యోగులుగా చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తే జగన్మోహన్ రెడ్డి వారిని జైలుకు పంపించడం జగన్మోహన్ రెడ్డి నియంత్రిత్వ పాలనకు నిదర్శమని వారన్నారు. సంక్షేమం పేరుతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని తాకట్టు పెడుతుందని వారు విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం రాష్ట్రానికి చంద్రబాబు సేవలు చాలా అవసరమని వారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు ప్రజలకు న్యాయం జరుగుతుందని వారన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో గురించి ప్రజలకు చదివి వివరిస్తూ తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి చేసి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని వారు తెలిపారు.

కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్, క్లస్టర్ కోఆర్డినేటర్ గిరీశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి, సంపత్ యాదవ్, రమణారెడ్డి, రవికుమార్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, సుధాకర్, జంగాల పెద్దన్న రామకోటి, వెంకటేశ్వర్లు, సుబ్బా రాయుడు, శంకరు, దేరంగుల శంకర్ , నరసింహులు, పెద్దన్న,సుబ్బన్న,భాస్కర్, ఎం బాస్కర్, హనుమంతు రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - నంద్యాల: నంద్యాల పట్టణంలోని రోడ్లపై నూసెన్స్ చేస్తే చర్యలు, శిక్షలు తప్పవని పట్టణ సీఐ వెంకట చలపతి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సాదిక్‌నగర్‌కు చెందిన సాదిక్ హుస్సేన్, సాజిద్ ఇద్దరు ఈనెల 2న గాంధీ చౌక్ సెంటర్ నందు బర్త్ డే పార్టీ పేరున కేక్ కట్ చేస్తూ గట్టిగా కేకలు వేస్తూ అల్లరి చేస్తూ వచ్చిపోయే వాహనాలకు, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ, ఆడవారితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపారు. వీరిని 2వ తరగతి మేజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి ముందు హాజరపరచగా 2 రోజుల కారాగార శిక్ష విధించడం జరిగిందని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గాంధీచౌక్, శ్రీనివాస్ సెంటర్, ఆత్మకూరు బస్టాండ్, ఆర్టీసీ బస్ స్టాండ్ ప్రాంతాల యందు అనుమతి లేకుండా వ్యక్తిగత కార్యక్రమాల కోసం జంక్షన్ ప్రజలను గాని, వచ్చి పోయే వాహనాలను గాని అడ్డగించి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే పోలీసు వారు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ బి.వెంకట చలపతి తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : దివ్యంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వీహెచ్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద్, దేవరాజు సీఐ జయచంద్ర దృష్టికి తీసుకెళ్లారు.మంగళవారం ఆయన పోలీసు స్టేషన్‌లో సీఐను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2016 దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలని ఎవరైనా దివ్యాంగులను ఉద్దేశం పూర్వకంగా హేళన చేసిన కించపరిచేలా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.అనంతరం సి.ఐ జయచంద్ర మాట్లాడుతూ ఎవరైనా దివ్యాంగులను హెలన చేసి కించపరిచేలా మాట్లాడితే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని వారికి రెండేళ్లు జైలు శిక్ష 20వేల జరిమానా విధించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విహెచ్పిఎస్సి నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ సిబ్బందికి పథకాలపై డాక్యుమెంటరీ శిక్షణ

విశాలాంధ్ర - పాములపాడు : ప్రభుత్వ పథకాలపై వ్యవసాయ మరియు క్షేత్రస్థాయి గ్రామీణ వ్యవసాయ సిబ్బందికి మండల కేంద్రమైన పాములపాడు లో వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి పనిశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ శిక్షణ కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది అయినా గ్రామ వ్యవసాయ సహాయకులు ఎంపీ ఓలు సామర్థ్య పెంపుదల మీద వివిధ పథకాల గురించి డాక్యుమెంటేషన్ మీద శిక్షణ ఇచ్చారు, అనంతరం క్షేత్రస్థాయి సిబ్బంది అయినా గ్రామ సహాయకులు శాఖపరంగా అమలవుతున్న పథకాలకు సంబంధించిన రిజిస్టర్లు పరిశీలించడమైనది ఎవరైనా క్షేత్ర పరంగా శాఖాపరంగా రిజిస్టర్లు మైంటైన్ చేయని ఎడల తగు చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించడమైనది ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ లు మద్దిలేటి, సాయి, ఎంపీ ఓలు పాల్గొన్నారు.

కర్నూలులో అవయవదానం విజయవంతం

వైద్యశాల చరిత్రలో మొట్టమొదటిసారిగా బ్రెయిన్ డెడ్ అయిన మహిళ నుండి సేకరణ
జిల్లా కలెక్టర్, సూపరింటెండెంట్‌ల వెల్లడి

విశాలాంధ్ర- వైద్యం : కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి చరిత్రలో మొట్టమొదటిసారిగా బ్రెయిన్ డైడ్ అయిన మహిళ నుండి అవయవదానం (ఆర్గాన్ రిక్రివల్) ఆపరేషన్ విజయవంతమైనది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి సృజన మాట్లాడుతూ ఈ యొక్క ఆపరేషన్ విజయవంతం కావడానికి సహాయ సహకారాలు అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి ,ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, ఈ యొక్క ఆపరేషన్ విజయవంతం కావడానికి కృషిచేసిన హాస్పిటల్ సిబ్బందికి పోలీస్ శాఖ వారికి ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ వెంకట రంగారెడ్డి మరియు గుండె వైద్య నిపుణులు డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి లకు ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. చివరగా డాక్టర్ వెంకట రంగారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఆపరేషన్లు బెంగళూరు , హైదరాబాద్ నగరాలలో మాత్రమే జరుగుతుంటాయని, మారుతున్న ఈ ఆధునిక యుగంలో ఎంతో ప్రయాసతో కూడిన ఇలాంటి కష్టతరమైన ఆపరేషన్స్ మన కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో ఇదే మొట్ట మొదటిసారన్నారు. ఈ అవయవ దానాలను హైదరాబాద్ ,విజయవాడ , కర్నూలు నగరాలలోని ప్రముఖ హాస్పిటల్ కు పంపించామన్నారు. కళ్ళను హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ కు , కిడ్నీలను కర్నూల్లోని కిమ్స్ హాస్పిటల్ కు మరియు లివర్ , లంగ్స్ విజయవాడ హాస్పిటల్ కు తరలించామని తెలిపారు.వరల్డ్ ఆర్గాన్ డొనేషన్ నియమ నిబంధనల ప్రకారం బ్రెయిన్ డెడ్ అయిన కుటుంబ సభ్యుల పర్మిషన్ ఉండాలన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన పావని లత (28)కుటుంబ సభ్యులు కర్నూల్ నగరంలోని బాలాజి నగర్లో నివాసం ఉంటున్నారు. వీరి తల్లిదండ్రులు కె.వి.ప్రతాపరెడ్డి సువర్ణమ్మలు. వీరి భర్త కూడా రెండు సంవత్సరాల క్రితం కిడ్నీ వ్యాధితో మరణించారని, జ్యోత్స్న (6) వయసు గల పాప కూడా ఉందన్నారు. చివరలో ప్రింట్ మీడియా మరి ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు కుటుంబ సభ్యులు సమాధానంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ అవయవ దానం అనే కార్యక్రమం మా కూతురు ఆలోచనని ఎందుకంటే రెండు సంవత్సరాల క్రితం వారి భర్త కిడ్నీల వ్యాధితో చనిపోయారని ఇలాంటి వారికి సహాయ సహకారాలు అందిస్తే మంచిగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ వెంకటరమణ ,డాక్టర్ శివ బాల నాగాంజన్, ప్రముఖ వైద్యులు మరియు హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయం వ్యాపారం కాకూడదు...సేవ కావాలి

కాంగ్రెస్ నుండి నంద్యాల అసెంబ్లీకి పోటీకి సిద్ధం.. రాజేంద్ర ప్రసాద్

విశాలాంధ్ర - నంద్యాల : రాజకీయం అనేది వ్యాపారం కాకూడదు, సేవ కావాలి... అలాంటి రాజకీయాలు ప్రస్తుతం ఎంతయినా అవసరం. నంద్యాలలో చెత్త, చెదారం పేరుకుపోతుంది... డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఇంత పెద్ద పాలనా యంత్రాంగం ఉన్నా నంద్యాల పట్టణంలో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.ఒకప్పుడు కుక్కలు, పందుల బెందద అని చెప్పుకునే వాళ్లం.. ఇప్పుడు దోమల గురించి చర్చించుకోవలసిన పరిస్థితి రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని సామాజిక సేవకుడు, కాంగ్రెస్ పార్టీనుండి నంద్యాల అసెంబ్లీ సీటు ఆశిస్తున్న రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం నంద్యాలలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఓ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను త్వరలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేయనున్నట్లు ప్రకటించారు. 1998 నుండి కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని, అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. వైసీపీ, టీడీపీ పార్టీల నాయకులకు టికెట్ల పైన ఉన్న శ్రద్ధ, మమకారం పట్టణంలో ఉన్న సమస్యల పైన లేదన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం నంద్యాల అసెంబ్లీ సీటు తనకు కేటాయిస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. రాజకీయాలు అంటే వ్యాపారం కాకూడదని ప్రజలకు సేవ చేయాలన్నారు. కరోనా సమయంలో ఏ రాజకీయ నాయకుడు చేయని విదంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవాకార్యక్రమాలు చేశానని, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, ఆత్మకూరు చెంచు గూడెలలోనూ సేవ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉన్నానని అన్నారు. త్వరలోనే పట్టణంలోని చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, రజకులకు ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేయనున్నట్లు గోళ్ల రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అయితేనే రాష్ట్రంలో ప్రత్యేక హెూదా ఇవ్వగలుగుతుందని, అలాగే జాతీయ కాంగ్రెస్ పార్టీ అయితేనే దేశంలో మతతత్వం, లౌకికతత్వం వెల్లి విరుస్తోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించాలి

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నంద్యాల ఆర్డిఓ మల్లికార్జున్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రతిఒక్కరూ నడవాలని ఆయన అన్నారు. ఎన్నికల నియమావళి గురించి రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు.

ఈ సమావేశంలో తాసిల్దార్ నజీర్ అహ్మద్ తో పాటు నియోజకవర్గంలోని తహసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దారులు, ఆళ్లగడ్డ ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ చంద్రశేఖరయ్యతో పాటు , రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆరోపణలు

విశాలాంధ్ర - నంద్యాల : రాజకీయ లబ్ధి పొందడం కోసమే కొంతమంది మా కుటుంబంపైన బురద జల్లుతున్నారని, తాము ఎలాంటి భూ కబ్జాలకు పాల్పడలేదని 6వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ భీమనపల్లె వెంకట సుబ్బయ్య, అతని కుమారుడు కౌన్సిలర్ పురంధర్ కుమార్ అన్నారు. రెండు రోజులుగా వారిపై వస్తున్న ఆరోపణలపై మంగళవారం నంద్యాల చెరువు కట్ట మూలమఠం వద్ద మాజీ కౌన్సిలర్ భీమనపల్లె వెంకట సుబ్బయ్య ఆయన కుమారుడు పురంధర్ కుమార్‌లు విలేకర్ల సమావేశంలో వివరణ ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కబ్జాలు చేశారంటూ అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. న్యాయం ఉంటే అవతలి వ్యక్తులు కోర్టులను ఆశ్రయించవ చ్చునన్నారు. కావాలని ఆరోపణలు చేస్తే పరువునష్టం దావావేస్తామని, అనవసరంగా ఎమ్మెల్యేను వివాదంలోకి లాగుతున్నారని, కేవలం ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో చౌకబారు విమర్శలు, ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

రూ 1.20 కోట్లతో డ్రైనేజి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-చాగలమర్రి : పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహం నుంచి చాగలమర్రి ఆలయం సమీపంలోని బుగ్గ వంక వరకు రూ. 1.20 కోట్లతో చేపట్టనున్న డ్రేనేజీ నిర్మాణానికి సర్పంచ్ తులసమ్మ, ఎంపీపీ వీరభద్రుడు,వార్డు సభ్యురాలు జ్యోతి,జేసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ బాబూలాల్,మండల కన్వీనర్ కుమార్‌రెడ్డిలు మంగళవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా కాలం నుండి అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజ్ సమస్యను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళగా ఉపాధి హామి నిధులు 1.20 కోట్లు మంజూరు చేయించారన్నారు. ఈనిధులతో డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య, ఇన్‌చార్జి ఈవో నాగమణి,కాంట్రాక్టర్ నజీర్, హెచ్‌ఎం కోటయ్య,మార్కెట్ యార్డు డైరెక్టర్ జాబీర్,వైసీపీ నాయకులు ఖాధర్‌బాష, బబ్లూ, మాబుసున్న, పెయింటర్ రఫీలు పాల్గొన్నారు.

యువతలో రాజకీయ మేధస్సు అద్భుతం

విశాలాంధ్ర - నంద్యాల : యువతలో రాజకీయ మేధస్సు అద్భుతంగా ఉందని నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలో గుడ్‌మార్నింగ్ యూత్ అనే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉదయాన్నే అభిరుచి మధు యువత ఉండే ప్రాంతాల్లో పర్యటించారు. వాకింగ్,క్రీడలు,జిమ్ తదితర ప్రాంతాల్లో యువతతో ముచ్చట్లు పెట్టారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలతో పాటు దేశ, ప్రపంచ రాజకీయాలు మాటల్లో చెప్పుకొచ్చారు. యువత రాజకీయ మేధస్సు అబ్బురపరచిందని, రాజకీయ నాయకులు పదవుల కోసం ఉచిత పథకాలు పెట్టి పేద ప్రజలను ఆకర్షిస్తూ పదవులు పొందుతున్నారని, దేశ వ్యాప్తంగా యువత మంచి, మంచి చదువులు చదివినా ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పెద్దలు యువతకు ఉద్యోగాలు వచ్చే విధంగా చూడాలని కోరారు. యువత నోటుతో కాకుండా ఓటుతో నాయకుల కళ్ళు తెరిపించాలన్నారు. పరిశ్రమలు స్థాపిస్తే యువతతో పాటు అన్ని వర్గాలు సంతోషంగా వుంటాయన్నారు. ఈయన వెంట బిజెపి నాయకులు వేణు, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-వెలుగోడు : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై భూపాలుడు అన్నారు. వెలుగోడు పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్‌లో మంగళవారం సాయంత్రం ఎస్సై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి, సెల్ ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపడం నేరమన్నారు. వాహనం చెందిన అన్ని పత్రాలు లైసెన్సు, ఆర్సీ, లైఫ్‌టాక్స్ సక్రమంగా ఉంచుకోవాలని తెలిపారు. పత్రాలు సరిగా లేని వాహనదారులకు జరిమానా విధించారు.

నగర పంచాయతీ చైర్మన్ కు పితృవియోగం

విశాలాంధ్ర- బేతంచెర్ల : బేతంచర్ల నగర పంచాయతీ చైర్మన్ సి.హెచ్. చలంరెడ్డి తండ్రి సి.హెచ్. లక్ష్మి రెడ్డి(78) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు. చైర్మన్ తండ్రి ఆకస్మిక మరణ వార్త తెలుసుకున్న ఎంపీపీ నాగభూషణంరెడ్డి, రాష్ట్రగిడ్డంగుల సంస్థ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి నివాళులు,పుష్పాంజలి ఘటించి,సంతాపాన్ని తెలిపారు. సమాచారంతెలుసుకున్నఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చలంరెడ్డికి చరవాణి ద్వారా పరామర్శించి, తమ సంతాపాన్ని తెలిపారు.సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు,అధికారులు, నాయకులు, కార్యకర్తలు తమ సంతాపాన్ని తెలియజేశారు.



మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 07, ఫిబ్రవరి 2024

రాజ్యాంగ పరిరక్షణ మన లక్ష్యంగా సాగుదాం..!

విశాలాంధ్ర - కర్నూలు : రాజ్యాంగ పరిరక్షణ మనలక్ష్యంగా సాగుదామని డిహెచ్ పీఎస్ జిల్లా కార్యదర్శి సీ మహేష్ అన్నారు. మంగళవారం దళితహక్కుల పోరాటసమితి 2024 రాష్ట్ర సమితి డైరీని కర్నూలు జిల్లా ఇన్చార్జి డీఈవో.సామెల్ పాల్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లాకార్యదర్శి సి.మహేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు కన్నకలలకు.. సమానత్వం. సహోదరత్వం దిశగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ మౌలిక సూత్రాలను ఆచరించే దిశగా ఈ 75 సంవత్సరాల ప్రయాణం సాగిందన్నారు. భారతదేశము రాజ్యాంగాన్ని నిర్మించు కోవడమే గొప్ప విజయమన్నారు. విశాల భారతావనిలో సమాన అవకాశాలు అందరికీ కల్పించాలని రాజ్యాంగం నిర్దేశిస్తుందని వారన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల ప్రస్తావనే లేదన్నారు. 1989 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అన్ని విధాలుగా నిర్వీర్యం చేస్తుందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ బడ్జెట్లో తగ్గించడం ద్వారా చివరకు గ్రామీణ ప్రాంత వ్యవసాయ కార్మికులు, దళితుల నోట్లోమట్టి కొట్టే విధంగా ఉందన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ దళితులపై జరుగుతున్న దాడుల పైన, ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ అమలుపైన, 1989 ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు నిధుల విడుదలపై భవిష్యత్తులో పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు. డిహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సి.కుమార్, నగరఅధ్యక్ష కార్యదర్శులు కుమార్ రాజా, రామచంద్ర,మాణిక్యం,సులోచన, జీవన్‌లు పాల్గొన్నారు.

తల్లి బీమా సొమ్ము కోసం...బాలుడు నిరీక్షణ

పోలీసులను ఆశ్రయించిన అనాథ బాలుడు - స్పందించిన ఎస్పై నరేష్

విశాలాంధ్ర-కల్లూరు: తల్లి దండ్రులు ఇద్దరుమృతి చెందడంతో అనాథగా మిగిలాడు మహేంద్ర. దీంతో కంబాల పాడు సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో విద్యనభ్యసిస్తున్న ఓ బాలుడు తన తల్లి మృతి చెందిన బీమా సొమ్మును తనకు ఇప్పించాలని మంగళ వారంఉదయం ఉలిందకొండ పోలీసులను ఆశ్రయించి తనను ఆదుకోవాలని కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ మేరకు మండల పరిధిలోని ఉలింద కొండ పోలీస్ స్టేషన్‌కు ఓ వృద్ధురాలు అవ్వ అక్కమ్మను వెంటపెట్టుకొని పోలీస్ స్టేషన్‌కు మహేంద్ర అనే పిల్లవాడు వచ్చాడు. తాను తల్లిదండ్రులను ఇద్దరిని కోల్పోయి అనాథగా ఉన్నానని, తాను పెద్దమ్మ సహాయ సహకారంతో హాస్టల్లో చదువుకుంటున్నానని పేర్కొన్నాడు. తన తల్లి కల్లూరు మండలం పుసులూరు గ్రామంలో నివాసం ఉంటూ మృతి చెందిందని తల్లికి సంబంధించిన బీమా సొమ్మును తనకు ఇవ్వకుండా వారి బంధువులు వారి ఆధీనంలో పెట్టుకొని తీవ్రఅన్యాయం చేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యాడు.

స్పందించిన ఎస్పై నరేష్ పిల్లవాడి తల్లి సోమేశ్వరి తండ్రి అయ్యస్వామిల భీమా సొమ్ము ఏ అకౌంట్లో జమ అయ్యింది పూర్తి వివరాలు తెలుసుకొని నివేదికలు ఇవ్వాలని బాధ్యులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన పేర్కొన్నారు. పిల్లవాడికి పూర్తి న్యాయం చేస్తామని ఎస్పై నరేష్ వారికి హామీ ఇచ్చారు.

సుదీర్ఘ పోరాట చరిత్ర ఏపీయూడబ్ల్యూజే సొంతం-టీజీ భరత్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం ఒక్క ఏపీయూ డబ్ల్యూజే తోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్.వీ. సుబ్బయ్య, గౌరవ సలహాదారులు వైవీకృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్రడైరీని కర్నూలు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి టీజీ భరత్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.ఎన్.రాజు, శ్రీనివాస్‌గౌడ్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, జిల్లా సహాయ కార్యద ర్శులు శివరాజ్ కుమార్, అవినాష్, వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి, యూనియన్ నాయకు లు మల్లికార్జున అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటాల చరిత్ర ఉన్న ఏకైక యూనియన్ ఏపీయూడబ్ల్యూజే అన్నారు. జర్నలిస్టుల హక్కుల కోసం ఏర్పాటైన ఈ యూనియన్ ఇంతింతై వటుడింతై అన్న చందంగా నేడు రాష్ట్రంలోని జర్నలిస్టులకు దిక్సూచిగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న జర్నలిస్టు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎప్పటికప్పుడు ఉద్యమాలు చేసి వారికి అండగా నిలుస్తుండడం అభినందనీయం అన్నారు. జర్నలిస్టుల అక్రిడేషన్లు, ఇంటిస్థలాలు, బస్ పాస్‌లు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్‌ల కోసం ఉద్యమించి సాధించిన యూనియన్ ఏపీయూడబ్ల్యూజే అన్నారు. అలాంటి గొప్పచరిత్ర కలిగిన యూనియన్ డైరీని తన చేతుల మీదుగా ఆవిష్కరించడం గర్వంగా ఉందన్నారు. మొదటి నుంచి తాము జర్నలిస్టులకు అండగా నిలుస్తున్నమని చెప్పారు. మునుముందు కూడా ఏ సమస్య వచ్చినా అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

బెదిరిస్తే బెదరం- సర్పంచు ప్రేమ్‌కుమార్

విశాలాంధ్ర - చిప్పగిరి: బెదిరిస్తే భయపడే ప్రసక్తే లేదని నేమకల్లు సర్పంచు ప్రేమ్ కుమార్ అన్నారు. మంగళ వారం మండల కేంద్రమైన చిప్పగిరి బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సర్పంచు ప్రేమ్ కుమార్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం మాగ్రామంలో పనిచేస్తూ ఉండగా ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ నారాయణ ఫోన్ చేసి నీవు ప్రస్తుత ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి వెంటఎలా తిరుగుతావంటూ బెదిరించే ధోరణికి పాల్పడం సమంజసం కాదన్నారు. మేము ఇప్పటికీ ఎప్పటికీ వైసీపీలోనే కొనసాగుతామని, మాకు ఎవరు ఎలాంటి బెదిరింపులకు పాల్పడిన భయపడే ప్రసక్తే లేదన్నారు. మాకు ఏమి జరిగినా ఆయనదే బాధ్యతని పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. ఈవిషయాన్ని ఆలూరు సీఐ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నేమకల్లు ఎంపీటీసీ సభ్యులు సుంకన్న, వైసీపీ నాయకులు నాగేంద్ర, సేనాపతి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-హొళగుంద : స్వామి వివేకానంద ట్రస్ట్ ఆదోని, భారత్ యూత్ సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు, వికలాంగులకు ఉచితంగా నిత్యవసర సరుకులను భారత్ యూత్ సంఘం నాయకుడు రవికాంత్ పంపిణీ చేశారు. మంగళవారం ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల అర్హులైన వికలాంగులకు వృద్ధులకు ఎలాంటి ఆదరణ లేకుండా బ్రతుకుతున్నవారికి సంఘం తరఫున నిత్యవసరకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 23 నెలల పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. మార్లమడకి చెందిన ఉల్లిగమ్మకు రెండుకాళ్లు లేవని నడవలేని స్థితిలో ఉండాలని ఎలాంటి జీవనాధారం లేకపోవడంతో ఆమెకు నెలనెల నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-చిప్పగిరి: గ్రామాల్లో దేవాలయాలు అభివృద్ధి చెందినప్పుడే గ్రామాల అభివృద్ధి చెందుతాయని ఆలూరు నియోజక వర్గం సమన్వయకర్త బుసినే విరుపాక్షి అన్నారు. మంగళ వారం చిప్పగిరిలోనే విరుపాక్షి స్వగృహం నియోజక వర్గం లోనే దేవనకొండ మండల పరిధిలోని బి.సెంటర్ పంచాయతీలకుందీన్నేలో నూతన శివాలయ దేవాలయం నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని ఇందుకుగాను మీ వంతు సహాయం చేయాలని ఆలూరు నియోజకవర్గం సమన్వయకర్త బుసినే విరుపాక్షిని కోరగా ఇందుకు స్పందించిన ఆయన శివాలయ దేవాలయం నిర్మాణం కొరకు రూ. 30 వేలు ఆర్థిక సహాయముగా గ్రామ పెద్దలైన లక్ష్మన్న, రాములుకు నగదురూపంలో అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల నిర్మాణం నావంతు సహాయం చేయడం జరిగిందన్నారు.కార్యక్రమంలో లక్ష్మన్న, రాములు, రామదాసు, పోతు వీరాచారి, కురుబ ఎల్లప్ప, రామకృష్ణ, బోయ లక్ష్మన్నలు పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న విద్యుత్ సబ్ స్టేషన్ పనులు

విశాలాంధ్ర-హొళగుంద: మండలంలోని కోకిల తోటలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ. 2.90 కోట్లు మంజూరయ్యాయి 4 నెలల క్రితం ఏడీపీ నాగేంద్రప్రసాద్ మరియు వైసీపీ నాయకులు ప్రజా ప్రతినిధులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రైతు గుడ్డప్ప ఉచితంగా ఎకరా భూమిని దానంగా ఇచ్చారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పనులుచురుకుగా సాగుతున్నాయి ముద్దటమాగి, మార్ల మడకి, సమ్మతగిరి,మూసాక్యాంప్, సమ్మతగిరి క్యాంప్, చిన్నహ్యాట, పెద్దా హ్యాట, బిజీహళ్లి, హొళగుంద టౌన్ కు విద్యుత్ సరఫరా అందరూ ఉంది 9 గ్రామాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి కాంట్రాక్టర్లు అధికా రులు విద్యుత్ స్తంభాలను క్రేన్ ద్వారా పాతి విద్యుత్తు తీగలను లాగు తున్నారు నూతన సబ్ స్టేషన్ నిర్మాణం వల్ల విద్యుత్ వినియోగదారులకు గృహాలకు చిన్నపరిశ్రమలకు విద్యుత్ సమస్య తప్పిందని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు తెలిపారు ఏడీపీ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయని వారంలో సబ్‌స్టేషన్ ప్రారంభించి ప్రజలకు విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు.

కర్నూలు ఎంపీ బరిలో బీసీని దింపనున్న టీడీపీ -పలువురు ఆశావహులు ప్రయత్నం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కర్నూలుఎంపీ బరిలో ఎవరు అన్నదానిపై ఇంకా టీడీపీ అధినాయకత్వం ప్రకటించకపోవడంపై పలువురు ఆశావహులు ఎవరికి వారు ప్రయత్నం చేసుకుంటున్నారు. గత ఎన్నికలలో టీడీపీ నుండి మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి బరిలో నిలిచారు.వైసీపీ 2014, 2019లో బీసీ అభ్యర్థులను బరిలోకి దింపి విజయం సాధించారు. టీడీపీ బీసీ అభ్యర్థి బీటీ నాయుడును బరిలో దింపింది. బీటీ నాయుడుపై వైసీపీ అభ్యర్థి బుట్టారేణుక 24వేల మెజారిటీతో విజయం సాధించారు. 2014లో జయ సూర్యప్రకాష్‌రెడ్డి బరిలో నిలిచి ఓటమిపాలైనారు. వైసీపీ ఇప్పటికే కర్నూలు మేయర్ బీవై రామయ్యను అభ్యర్థిగా ప్రకటించింది. ఈ సారి టీడీపీ బీసీ అభ్యర్థినే బరిలో దింపాలని నిర్ణయం తీసుకుంది. దీంతో అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు పలువురు ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా బీసీలలో ముఖ్యంగా కురువ సామాజిక వర్గం ఒక వైపు మరో వైపు యాదవ, మరోవైపు వాల్మీకి సామాజిక వర్గం పోటీకి సిద్ధమైనారు. కురువ సామాజిక వర్గం నుండి సినీ డైరెక్టర్ నాగరాజు, బత్తిన లక్ష్మీనారాయణ, బళ్ళారికి చెందిన శశికళలు యాదవ సామాజిక వర్గంకు చెందిన లక్కీటూ సోదరులు పోటీ చేయడానికి ఉత్సాహం చూపుతుండగా రిటైర్డ్ పోలీసు అధికారి వెంకట్రామయ్య కూడా అవకాశం ఇస్తే పోటీకి సిద్ధమైనట్లు తెలుస్తుంది. నియోజకవర్గంలో బీసీలు బలంగా ఉండటంతో బీసీలకు సీటు ఇచ్చేందుకు అధిక, ప్రతిపక్షపార్టీలు సిద్ధమైనాయి. వైసీపీ ముందుగా మంత్రి గుమ్మనూరు జయరాం పేరును ప్రకటించగా ఆయన తనకు ఆలూరు సీటు ఇవ్వాలని పట్టుపట్టారు. తనకుటుంబ సభ్యులకు ఆలూరు సీటు ఇస్తే తాను ఎంపీగా పోటీ చేస్తానని అధిష్టానంకు తెగేసి చెప్పడంతో వైసీపీ కర్నూలు మేయర్ బీవై రామయ్యను అభ్యర్థిగా ప్రకటించింది. ఒకవేళ అధిష్టానం ఒప్పించి కర్నూలు ఎంపీ సీటు జయరాంకు కేటాయించే అవకాశం కూడా లేకపోలేదు.గుమ్మనూరు జయరాం టీడీపీ అధిష్టానంతో టచ్‌లో ఉన్నారు.ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబుతో గుమ్మనూరు చర్చలు జరిపినట్లు తెలుస్తుంది .ఆలూరు సీటు తన కుమారుడు ఈశ్వర్‌కు ఇస్తే కర్నూలు ఎంపీ బరిలో నిలుస్తానని టీడీపీ అధినేతను కోరినట్లు తెలుస్తుంది.ఆయనకు అధినేత నుండి ఇప్పటి వరకు ఎటువంటి హామీ రాకపోవడంతో టీడీపీ కండువ కప్పుకోలేదనే ప్రచారం ఉంది.

టీడీపీ ఎంపీ అభ్యర్థి ప్రకటనలో జాప్యం కావడం వలన ఎవరికి వారు తనకే సీటు వస్తుందని ఆశావహులు ఆశతో ఉన్నారు. అదిష్టానం అభ్యర్థి ప్రకటన ఆలస్యం కావడం..ఎన్నికల నోటిఫికేషన్ మరి కొద్దిరోజుల్లో రానుండటంతో అభ్యర్థి ఇబ్బందులు పడే అవకాశం లేకపోలేదు. అభ్యర్థులు ఎవరు అన్న దానిపై కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. అదిష్టానం అభ్యర్థిని తొందరగా ప్రకటిస్తే కార్యకర్తలకు ఊరట కలుగుతుంది.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి-జిల్లా కలెక్టర్ డా. జి.సృజన

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు : ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఎన్నికల నిర్వహణ సన్నద్ధత, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, ఆరోగ్య శ్రీ యాప్ డౌన్ లోడ్, కులగణన సర్వే తదితర అంశాల పై ఆర్ ఓ లు, తహసీల్దార్ లు, ఎంపిడిఓ లు,సంబంధిత జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాకు బదిలీపై వచ్చిన మండల స్థాయి అధికారులు ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు.. ఎన్నికల నిర్వహణ లో తహశీల్దార్లు, ఎంపిడిఓలు ఇద్దరూ కీలకం అని, త్వరితగతిన వారి వారి మండలాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు..వచ్చే 10, 15 రోజుల్లో ఆయా మండలాల పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ స్టేషన్ లను పరిశీలించాలని కలెక్టర్ తహశీల్దార్లు, ఎంపిడిఓ లను ఆదేశించారు.. సెక్టార్ ఆఫీసర్ లు, బి ఎల్ వో లతో సమావేశం నిర్వహించుకోవాలని సూచించారు..ఎన్నికలకు సంబంధించిన పనులతో పాటు ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాల అమలుపై కూడా దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు .ఎన్నికల నిర్వహణ కు సంబంధించి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఎలక్షన్ ను కొత్త గానే భావించి, భారత ఎన్నికల సంఘం రూపొందించిన ఎన్నికల నియమావళి పై పూర్తి అవగాహన ఉండాలన్నారు..కింది స్థాయి సిబ్బంది మీద ఆధార పడకుండా రిటర్నింగ్ అధికారి హ్యాండ్ బుక్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ,ఇతర నియమాలను తప్పనిసరిగా చదవాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకానికి సంబంధించిన ఇళ్ళ స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఫిబ్రవరి 9 వ తేది నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎంపిడిఓ లను, తహసీల్దార్ లను కలెక్టర్ ఆదేశించారు..సచివాలయం సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆదేశించారు.జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ ఇళ్ళ పట్టాల రిజిస్ట్రేషన్ కు సంబంధించి 93,811 మంది అర్హులైన లబ్ధిదారులు ఉన్నారని అందులో 77,097 మందికి ప్లాట్ నంబర్ ఉన్నందున బౌండరీలు మ్యాప్ చేసి 75,970 కి రిజిస్ట్రేషన్ కన్ఫర్మ్ చేయడం జరిగిందని, ఇంకా 1127 ప్లాట్స్ కు బౌండరీలు లేకుండా ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు.. ప్లాట్ నంబర్లు లేని లబ్ధిదారులు 16,714 మంది ఉన్నారని అందులో 496 మ్యాప్ చేయవలసి ఉందని మిగిలిన 16,218 న్యాయస్థానంలో, అనర్హులుగా ఉన్నాయని వాటిని మ్యాప్ చేయలేమని అన్నారు... 321 సచివాలయాలలో 66,431 రిజిస్ట్రేషన్ డేటా పోర్ట్ అయ్యిందని, అందులో 276 సచివాలయాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, 45 సచివాలయాలలో పెండింగ్ లో ఉందన్నారు.ఏదైనా సచివాలయంలో నెట్వర్క్ సమస్యలు ఉన్నట్లయితే వేరే సచివాలయం కి వెళ్లి చేసుకునే అవకాశం కూడా ఉందని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.

పట్టా పొందిన లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

విశాలాంధ్ర -కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద లబ్ధిదారులకు అందించిన పట్టాలను ప్రతి ఒక్కరు సచివాలయాల్లో రిజిస్టర్ తప్పనిసరిగా చేయించు కోవాలని జాయింట్ సబ్ రిజిస్టర్ నాగేశ్వరావు ప్రజలకు సూచించారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని ఉలిందకొండ సచివాలయంలో పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమంనిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉలిందకొండ, యాపర్లపాడు రెండు రెవెన్యూ పంచాయతీలలో 280 ఇళ్ల పట్టాలను రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందని ఈ పట్టాలను లబ్ధిదారులకు శాశ్వత హక్కు కల్పించేందుకు సచివాలయాల్లో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామన్నారు.లబ్ధిదారులు తప్పనిసరిగా సచివాలయాలకు వచ్చి రిజిస్ట్రేషన్‌చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యాపర్లపాడు విఆర్ఓ శివ జ్యోతి, విబికే తిరుపాలు, వీఆర్ఏ మధు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

విశాలాంధ్ర -హొళగుంద : బీసీ కాలనీలో విద్యుత్ తీగలు ఇండ్లపై వేలాడుతున్నాయని దీనివల్ల ప్రమాదం పొంచి ఉన్నదని కాలనీ ప్రజలు ఆరోపించారు. విద్యుత్ తీగలు ఇండ్లపై వేలాడుతున్నాయని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌తీగలతో భయం భయంగా కాలంగడుపుతున్నామని ఇంటి యజమాని జంజాలి మల్లేష్ మంగళవారం తెలిపారు. విద్యుత్ తీగలను ఇంటిపై నుండి ఎత్తుగా బిగించాలంటూ సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోలేదని వాపోయారు విపరీతంగా వీచే గాలులకు విద్యుత్ తీగలు తాకితే మంటలు ఏర్పడతాయని వాపోయారు .భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని అధికారులను మల్లేష్ ప్రశ్నించారు.

ఉలిందకొండ జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు మృతి

విశాలాంధ్ర -కల్లూరు: ఉలిందకొండ జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఎ.రామకృష్ణ (54) మృతిచెందినట్లు హెచ్‌ఎం ఎం.లీలావతి తెలిపారు. మంగళవారం హెచ్‌ఎం తోటి ఉపాధ్యాయులు పాఠశాలలో ఉపాధ్యాయుడి మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ 2022 నుండి ఉలిందకొండ పాఠ శాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడని కర్నూల్ నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ శిక్షణ కార్యక్రమానికి ఆయన సోమవారం వెళ్లడం జరిగిందని శిక్షణ పూర్తి తర్వాత సాయంత్రం ఇంటికి వెళుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయి పడడంతో గమనించిన తోటి ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం కర్నూలు సర్వజన వైద్యశాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఉపాధ్యాయుడు రామకృష్ణ మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య తెలుగు అధ్యాపకురాలుగా ఓర్వకల్లు మండలంలో ఓ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఎన్ఎస్ పాఠ్యాంశం ఎంతగానో చక్కగా బోధించేవాడని ఉపాధ్యాయునిగా ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నాడని ఆయన లేని లోటు తీరనిదని ఉపాధ్యా యు లు విద్యార్థులు ఆయన సేవలను గుర్తు చేసుకుని కన్నీరుమున్నీరయ్యారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

వైయస్సార్ ఆసరా తోనే మహిళ అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-దేవనకొండ : వైసీపీ ప్రవేశపెట్టిన ఆసరా తోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని వైసీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున అన్నారు. మంగళవారం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకట లక్ష్మమ్మ అధ్యక్షతన వైసీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున స్థానిక తిక్కతాత ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వైయస్సార్ ఆసరా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాటి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అమలులో భాగంగా గ్రామీణ పట్టణ ప్రాంతాలలోని పేదరిక నిర్మూలన మహిళ ఆర్థిక అభివృద్ధి తోనే సాధ్యమని నమ్మి వైయస్సార్ ఆసరా పథకాన్ని సెప్టెంబర్ 2020 న ప్రారంభించారని తెలిపారు, ఈ పథకం అమలు ద్వారా ఆంధ్రప్రదేశ్ లో నివసిస్తున్న నిరుపేద మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు సహాయపడుతుందన్నారు నాలుగో విడత వైస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. వైయస్సార్ ఆసరా నాలుగో విడత కార్యక్రమం కింద దేవనకొండ మండలానికి 627 పొదుపు సంఘాలగాను ఒక కోటి 92 లక్షల 95 వేల రూపాయలు రావడం జరిగింది ఈ మెగా చెక్కు మండల మండల సమాఖ్య అధ్యక్షురాలు, వెలుగు ఏపిఎం రమేష్, హెచ్ డి సి సి, నరసన్న,ఎంపీపీ భర్త లుబాంబా,ఎంపీటీసీ, తపాల శ్రీనివాసులు, వైయస్సార్సీపి నాయకులు వేమకూరు రామచంద్ర ,మండల వైకెపి అధికారులు, వెలుగు శాఖల అధికారులు, మండలంలోని వివిధ గ్రామాల నుండి పొదుపు మహిళలు పాల్గొని రానున్న రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి మరెన్నో పథకాలు తీసుకువచ్చి మహిళలకు ఆసరాగా నిలిచేందుకు ముందుంటారని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

విశాలాంధ్ర -కోసిగి: మండల పరిధిలోని తుంబిగనూరు సమీపానఅక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ ఎస్.మెహబూబ్ భాష, ఎస్సై రమేష్‌బాబు లు తెలిపారు. మంగళవారం ఉదయం తనిఖీల్లో భాగంగా దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. 16 బాక్సుల్లో సుమారు రూ.60 వేలు విలువ గల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేశామన్నారు. దొరికిన ప్రాంతంలో మద్యం తరలిస్తున్న వ్యక్తులు ఎవరు లేకపోవడంతో మద్యం బాక్సులు స్వాధీన పరుచుకుని, అనుమానం వచ్చిన ఇద్దరు వ్యక్తుల కోసం గాలిస్తున్నామన్నారు.అనుమానితులనుపట్టుకుని, కేసునమోదు చేస్తామన్నారు.ఎన్నికల నిబంధనల మేరకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమన్నారు. సిబ్బంది ఎస్.నాగరాజు, మధు, రాముడు, నాగరాజులు తనిఖీల్లో పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ క్వారీల తనిఖీలు

విశాలాంధ్ర- కర్నూలు జిల్లా పరిషత్ : డోన్ పట్టణ పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో క్వారీలలో అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న సమాచారం రావడంతో జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తనిఖీ చేపట్టామన్నారు. ఈతనిఖీల్లో ఏడి బైరాగినాయుడు రాయల్టీ ఇన్స్పెక్టర్ మురహరి, శ్రీనివాసరెడ్డి, సర్వేయర్ సీతామాయి, తదితర సిబ్బంది పాల్గొన్నారు. అక్రమంగా తవ్వుతున్న క్వారీల్లో తనిఖీ చేపట్టామన్నారు. ఒకవేళ అక్రమాలకు పాల్పడితే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్
కర్నూలు
డిస్ప్యూట్ నెంబరు :117/2023
మెస్సర్స్ శ్రీ రామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్
వర్సెస్...
ఎం.అబ్దుల్ అలీం మరియు 2 ఇతరులు
....అపోనెంట్స్
అపోనెంట్స్ 1 నుండి ముగ్గురికి నోటీసులు
1). ఎం.అబ్దుల్ అలీం, తండ్రి పేరు : ఎం.అబ్దుల్ సలీం, ఇంటి నెం.2/514, పోస్టల్ కాలనీ, ఆదోని
2). ఎం.అబ్దుల్ కలీం, తండ్రి పేరు : అబ్దుల్ సలీం , ఇంటి నెం.2/514, పోస్టల్ కాలనీ, ఆదోని కర్నూలు జిల్లా
3). ఎం.దామోదర్ చౌదరి, తండ్రి పేరు: ఎం.రంగన్న, ఇంటి నెం.2/438, పోస్టల్ కాలనీ, ఆదోని, కర్నూలు జిల్లా
.....అపోనెంట్స్
డిస్ప్యూట్ బాకీ మొత్తం రూ.57,350/- రాబట్టుకొనుటకు గాను మీపైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1నుండి 3వ అపోనెంట్స్ అయిన మీరు 22-02-2024వ తేది రోజున ఉదయం 11.00గంటలకు మీరుగాని మీ తరపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీవరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా.22-02-2024
బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ కర్నూలు.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్
కర్నూలు
డిస్ప్యూట్ నెంబరు:116/2023
మెస్సర్స్ శ్రీ రామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆదోని బ్రాంచి.
...డిస్ప్యూటెంట్
వర్సెస్...
ఎస్.నాజియా ఖనం మరియు 3 ఇతరులు
...అపోనెంట్స్
అపోనెంట్స్ 1 నుండి నలుగురికి నోటీసులు
1).ఎస్.నాజియా ఖనం,భర్త పేరు : ఎం.అబ్దుల్ కలీం, ఇంటి నెం.2/514, పోస్టల్ కాలనీ, ఆదోని, కర్నూలు జిల్లా
2). ఎం.అబ్దుల్ కలీం , తండ్రి పేరు : అబ్దుల్ సలీం , ఇంటి నెం.2/514, పోస్టల్ కాలనీ, ఆదోని కర్నూలు జిల్లా
2).ఎం.దామోదర్ చౌదరి , తండ్రి పేరు : ఎం.రంగన్న, ఇంటి నెం.2/438, పోస్టల్ కాలనీ, ఆదోని, కర్నూలు జిల్లా
3). సి.ఎం.డి. ఆసిఫ్ బాషా, తండ్రి పేరు : సి.నదీముల్లా, ఇంటి నెం. 19/48, ఫరీద్‌సాహెబ్ స్ట్రీట్, ఆదోని, కర్నూలు జిల్లా
..........అపోనెంట్స్
డిస్ప్యూట్ బాకీ మొత్తం రూ.1,57,373/- రాబట్టుకొనుటకుగాను మీపైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1నుండి 4వ అపోనెంట్స్ అయిన మీరు 22-02-2024వ తేది రోజున ఉదయం 11.00 గంటలకు మీరుగాని మీ తరపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీవరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా.22-02-2024
బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ కర్నూలు.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్
కర్నూలు
డిస్ప్యూట్ నెంబరు :115/2023
మెస్సర్స్ శ్రీ రామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆదోని బ్రాంచి.
...డిస్ప్యూటెంట్
....వర్సెస్
ఎస్.నాజియా ఖనం మరియు 4 ఇతరులు
...అపోనెంట్స్
అపోనెంట్స్ 1 నుండి ఐదుగురికి నోటీసులు
1). ఎస్.నాజియా ఖనం, భర్త పేరు : ఎం.అబ్దుల్ కలీం, ఇంటి నెం.2/514, పోస్టల్ కాలనీ, ఆదోని, కర్నూలు జిల్లా
2). ఎం. దామోదర్ చౌదరి, తండ్రి పేరు: ఎం.రంగన్న, ఇంటి నెం.2/438, పోస్టల్ కాలనీ, ఆదోని, కర్నూలు జిల్లా
3). సి ఆసిఫ్ బాషా, తండ్రి పేరు : సి.నదీముల్లా, ఇంటి నెం. 19/48, ఫరీద్‌సాహెబ్ స్ట్రీట్, ఆదోని, కర్నూలు జిల్లా
4). ఎం.ఏ.ఖాలిక్ , తండ్రి పేరు : ఎం.ఏ.సలీం , ఇంటి నెం.2/514/ఏ, పోస్టల్ కాలనీ, ఆదోని, కర్నూలు జిల్లా
5). ఎం. అబ్దుల్ కలీం , తండ్రి పేరు : అబ్దుల్ సలీం, ఇంటి నెం.2/514, పోస్టల్ కాలనీ, ఆదోని కర్నూలు జిల్లా
.....అపోనెంట్స్
డిస్ప్యూట్ బాకీ మొత్తం రూ.6,38,376/- రాబట్టుకొనుటకుగాను మీపైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1నుండి 5వ అపోనెంట్స్ అయిన మీరు 22-02-2024వ తేది రోజున ఉదయం 11.00 గంటలకు మీరుగాని మీ తరపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీవరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా.22-02-2024
బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ కర్నూలు.

ఏఒక్క కార్యకర్తను వదులుకోను-విరుపాక్షి

విశాలాంధ్ర-చిప్పగిరి: ఆలూరు నియోజకవర్గంలో ఏ ఒక్క వైసీపీ కార్యకర్తను వదులుకోనని ఈనెల 11న అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం కార్యక్రమం విజయవంతం చేసేందుకు సిద్ధం కావాలని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన చిప్పగిరి గోవిందప్పస్వామి ఆలయఆవరణలో మండల వైసీపీ కార్యకర్తల సమావేశమును మండల వైసీపీ కన్వీనర్ జూటూరు మారయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికిముఖ్యఅతిథులుగా నియోజకవర్గం సమన్వయకర్త విరుపాక్షి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ మెంబర్ల తోపాటు ఏ ఒక్క వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలను వదులుకోనని త్వరలోనే మండలంలోని ఆయా గ్రామాలలో పర్యటించి ప్రతి ఒక్కరి దగ్గరకు వస్తానన్నారు. ఈనెల 11న నాలుగు జిల్లాలకు సంబంధించి సిద్ధం కార్యక్రమమును నిర్వహించడం జరుగుతుందని,కార్యక్రమానికి నియో జక వర్గంలోనే ప్రతిగ్రామం నుండి వైసీపీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సిద్ధం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జూటూరు మారయ్య, బెల్డోన సొసైటీ అధ్యక్షులు దేగులపాడు మల్లికార్జున, నేమకల్ సర్పంచు ప్రేమ్‌కుమార్, ఎంపీటీసీసభ్యులు సుంకన్న, నాగేంద్ర, సేనాపతి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర -కర్నూలు సిటీ: కర్నూలు వీధుల్లో కుక్కలు, దోమల నివారణకు తగుచర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ భార్గవతేజకు కార్పొరేటర్లు వాసు, యూనిస్‌భాష, ఖాదర్ బాషా, ఫరీన్, జుబేర్, నవీన్‌లు వినతి పత్రం అందజేశారు. నగరపాలక సంస్థలో తాత్కాలికంగా పారిశుద్ధ్య సిబ్బందిని పెంచాలని, మలేరియా నివారణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కాలువలు శుభ్రం చేసేందుకు వార్డుల్లో తగినంత సిబ్బందిని నియమించాలని, ప్రతి వార్డ్ లో పవర్ స్ప్రే, ఫాగింగ్, హంద్రీ నది లో గుర్రపు డెక్క మొక్కలను తొలగించి శుద్ధి చేయాలని కోరారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 07, ఫిబ్రవరి 2024

ప్రజల నీటి కష్టాలు తీరుస్తా.. టీడీపీ ఇంచార్జి టి.జి. భరత్

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు : కర్నూలు వాసుల తాగునీటి కష్టాలు తాను తీరుస్తానని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి.భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని మౌర్య ఇన్‌లో 22వ వార్డుకు చెందిన మహిళలు టి.జి భరత్‌ను కలిసి మద్దతు తెలిపి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈసందర్భంగా టి.జి.భరత్ మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. కర్నూలు చుట్టూ తుంగభద్ర, హంద్రీ, కె.సి కెనాల్ ఉన్నప్పటికీ త్రాగునీటి కోసం నగరవాసులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు. అప్పట్లో తన తండ్రి టి.జి వెంకటేష్ నిర్మించిన సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదన్నారు. చెక్ డ్యాం నిర్మించాలని ఆయన అనుకున్నారని.. అయితే ఆ తర్వాత వచ్చిన పాలకులు దాని గురించి పట్టించుకోలేదన్నారు. రానున్న వేసవిలో ప్రజలకు నీటి కష్టాలు వస్తే బాధ్యత ఎవరు వహిస్తారన్నారు. అందుకే ప్రజలు వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని టి.జి భరత్ కోరారు. ఈ ప్రభుత్వంలో తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. తమ టిడిపి, జనసేన ప్రభుత్వంలో అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి శ్రీధర్, బూత్ ఇంఛార్జీలు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగరంలోని 4వ వార్డు చిత్తారి వీధికి చెందిన పలువురు టిడిపి నాయకురాలు నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. టి.జి భరత్ వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రతిపోలింగ్ స్టేషన్‌లో మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటాం

పాణ్యం నియోజకవర్గ ఈఆర్వో / జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

విశాలాంధ్ర బ్యూరో– కర్నూలు : పాణ్యం నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్ లో మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటామని పాణ్యం నియోజకవర్గ ఈఆర్వో / జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పాణ్యం నియోజకవర్గంలోని పొలిటికల్ పార్టీ ప్రతినిధులకు తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో తుది ఓటర్ల జాబితా ప్రచురణ మరియు పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులపై పాణ్యం నియోజకవర్గ పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో మరియు పాణ్యం నియోజకవర్గంలోని తహసిల్దార్లతో పాణ్యం ఈఆర్వో / జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య సమీక్ష నిర్వహించారు. పాణ్యం నియోజకవర్గ ఈఆర్వో / జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్ లో మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటామని పాణ్యం నియోజకవర్గ పొలిటికల్ పార్టీ ప్రతినిధుల కు తెలియజేశారు.సాధారణ ఎన్నికల సందర్భంగా బదిలీపై పాణ్యం నియోజకవర్గానికి వచ్చిన తహసిల్దార్లు పాణ్యం నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషను తనిఖీ చేసి మౌలిక వసతులపై రిపోర్ట్ సమర్పించాలని తహసిల్దార్లను ఆదేశించారు. ఎలాంటి సమస్యలు ఉన్న తక్షణమే నా దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్లకు ఆదేశించారు.తదనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు కొన్ని పోలింగ్ స్టేషన్ లలో ఉన్న సమస్యలు , కొన్ని పోలింగ్ స్టేషన్ లు 2 కిలోమీటర్లు కంటే ఎక్కువ దూరంగా ఉన్నట్లు, నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్ ల లోకేషన్ మార్చాలని, పోలింగ్ స్టేషన్ ల నందు మౌలిక వసతులు ఖచ్చితంగా ఉండేటట్లు చూడాలని, కల్లూరు ప్రాంతంలోని ఓటర్ల జాబితాలో ఇంటి నెంబర్ కు బదులుగా ప్లాట్ నెంబర్లు వేశారని వాటిని సరి చేయించాలని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా, అన్ని పోలింగ్ స్టేషన్లను పర్యటించి , పాఠశాలలో జరుగుచున్న పనులు పూర్తి కావస్తున్నందున వాటిని పర్యవేక్షించిన తరువాత పోలింగ్ స్టేషన్ ల మార్పులు చేర్పుల వివరాలు రాజకీయ పార్టీలకు అందజేయగలమని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు , పోలింగ్ స్టేషన్ కు సంబంధించిన సమస్యలు ఉన్న యెడల తన దృష్టికి తీసుకొని రావలసిందిగా రాజకీయ పార్టీల ప్రతినిధుల ను కోరారు. ఈ సమావేశంలో మండల తహశీల్దారులు ఓర్వకల్లు - నటరాజ్,పాణ్యం - ఫణి కుమార్ , కల్లూరు - మునివేలు , గడివేముల ఇంచార్జ్ తహసిల్దార్ గురునాథ్, ఎలక్షన్స్ డిప్యూటీ తాహసిల్దార్ - అనురాధ , బిజెపి పార్టీ తరపున రామ్మోహన్ రెడ్డి , తెలుగుదేశం పార్టీ తరపున యశ్వంత్ రెడ్డి , వై ఎస్ ఆర్ పార్టీ తరపున హనుమంతు రెడ్డి, సిపిఐ పార్టీ తరపున శ్రీనివాసరావు బిఎస్పితరపున చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర– కోడుమూరు :విశాలాంధ్ర 2024 క్యాలెండర్ ను కోడుమూరు నియోజకవర్గ సీపీఐ నాయకులు,అధికారులు,ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆవిష్కరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణలో ప్రభుత్వ అధికారులు

మండల తహసిల్దార్ బి జయన్న, కోడుమూరు సిఐ మన్సూరుద్దీన్,ఎస్ఐ ఎపి శ్రీనివాసులు, వీఆర్వోలు విశ్వనాథ రెడ్డి,ఎల్లప్ప,పరమేష్, లాలప్ప,మహేష్, హరికృష్ణ, వెంకటరాముడు

సీపీఐ నాయకులు–రాజకీయ ప్రముఖులు

జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ, మండల కార్యదర్శి బి రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శేషు కుమార్ యాదవ్,ఏఐటీయూసీ నాయకులు మద్దూరు రాముడు,ఆటో యూనియన్ నాయకులు మధు,హమాలీ కార్మిక సంఘం నాయకులు బజారి,సుంకన్న

టీడీపీ నాయకులు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ మహిళా విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ నేషపోగు కిరణ్మయి, తులసి,గౌరీ,లేపాక్షి, పూర్ణచంద్రరావు తదితరులు

వైసీపీ నాయకులు

కేడిసిఎంఎస్ చైర్మన్ శిరోమణి, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త,కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మద్దయ్య, నియోజకవర్గ ఇన్చార్జి ఆదిమూలపు సతీష్,జడ్పీటిసి బి రఘునాథరెడ్డి,మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్, వైసిపి జిల్లా పబ్లిసిటీ వింగ్ జనరల్ సెక్రెటరీ గుంతకంటి మల్లారెడ్డి,నలుబోలు తేనేశ్వర రెడ్డి,మండల కన్వీనర్ రమేష్ నాయుడు, వేణుగోపాల్ రెడ్డి,జిల్లా వైసీపీ మైనార్టీ సెల్ విభాగం జనరల్ సెక్రెటరీ సాజిత్ అలీ, వైసిపి జిల్లా టియుసి విభాగం జాయింట్ సెక్రెటరీ రాంపురం శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో అవయవదానం విజయవంతం

వైద్యశాల చరిత్రలో మొట్టమొదటిసారిగా బ్రెయిన్ డెడ్ అయిన మహిళ నుండి సేకరణ

జిల్లా కలెక్టర్, సూపరింటెండెంట్‌ల వెల్లడి

విశాలాంధ్ర– వైద్యం : కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి చరిత్రలో మొట్టమొదటిసారిగా బ్రెయిన్ డైడ్ అయిన మహిళ నుండి అవయవదానం (ఆర్గాన్ రిక్రివల్) ఆపరేషన్ విజయవంతమైనది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి సృజన మాట్లాడుతూ ఈ యొక్క ఆపరేషన్ విజయవంతం కావడానికి సహాయ సహకారాలు అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి ,ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, ఈ యొక్క ఆపరేషన్ విజయవంతం కావడానికి కృషిచేసిన హాస్పిటల్ సిబ్బందికి పోలీస్ శాఖ వారికి ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ వెంకట రంగారెడ్డి మరియు గుండె వైద్య నిపుణులు డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి లకు ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. చివరగా డాక్టర్ వెంకట రంగారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఆపరేషన్లు బెంగళూరు , హైదరాబాద్ నగరాలలో మాత్రమే జరుగుతుంటాయని, మారుతున్న ఈ ఆధునిక యుగంలో ఎంతో ప్రయాసతో కూడిన ఇలాంటి కష్టతరమైన ఆపరేషన్స్ మన కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో ఇదే మొట్ట మొదటిసారన్నారు. ఈ అవయవ దానాలను హైదరాబాద్ ,విజయవాడ , కర్నూలు నగరాలలోని ప్రముఖ హాస్పిటల్ కు పంపించామన్నారు. కళ్ళను హైదరాబాద్ ఎల్వి ప్రసాద్ హాస్పిటల్ కు , కిడ్నీలను కర్నూల్లోని కిమ్స్ హాస్పిటల్ కు మరియు లివర్ , లంగ్స్ విజయవాడ హాస్పిటల్ కు తరలించామని తెలిపారు.వరల్డ్ ఆర్గాన్ డొనేషన్ నియమ నిబంధనల ప్రకారం బ్రెయిన్ డెడ్ అయిన కుటుంబ సభ్యుల పర్మిషన్ ఉండాలన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన పావని లత (28)కుటుంబ సభ్యులు కర్నూల్ నగరంలోని బాలాజి నగర్లో నివాసం ఉంటున్నారు. వీరి తల్లిదండ్రులు కె.వి.ప్రతాపరెడ్డి సువర్ణమ్మలు. వీరి భర్త కూడా రెండు సంవత్సరాల క్రితం కిడ్నీ వ్యాధితో మరణించారని, జ్యోత్స్న (6) వయసు గల పాప కూడా ఉందన్నారు. చివరలో ప్రింట్ మీడియా మరి ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు కుటుంబ సభ్యులు సమాధానంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ అవయవ దానం అనే కార్యక్రమం మా కూతురు ఆలోచనని ఎందుకంటే రెండు సంవత్సరాల క్రితం వారి భర్త కిడ్నీల వ్యాధితో చనిపోయారని ఇలాంటి వారికి సహాయ సహకారాలు అందిస్తే మంచిగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ వెంకటరమణ ,డాక్టర్ శివ బాల నాగాంజన్, ప్రముఖ వైద్యులు మరియు హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుదీర్ఘ పోరాట చరిత్ర ఏపీయూడబ్ల్యూజే సొంతం-టీజీ భరత్

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు : రాష్ట్రంలో జర్న లిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల ప రిష్కారం ఒక్క ఏపీ యూ డబ్ల్యూజే తో నే సాధ్యమని ఆం ధ్రప్రదేశ్ యూని యన్ ఆఫ్ వర్కిం గ్ జర్నలిస్ట్స్ (ఏపీ యూడబ్ల్యూజే) జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్.వీ. సుబ్బయ్య, గౌరవ సలహాదారులు వైవీకృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. ఏపీ యూడబ్ల్యూజే రాష్ట్రడైరీని కర్నూలు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి టీజీ భరత్ చేతుల మీదుగా ఆవి ష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.ఎన్.రాజు, శ్రీనివాస్‌గౌడ్, ఎలక్ట్రా నిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, జిల్లా సహాయ కార్యద ర్శులు శివరాజ్ కుమార్, అవినాష్, వెంకటేష్, జిల్లా కార్య వర్గ సభ్యులు చిరంజీవి, యూనియన్ నాయకు లు మల్లికార్జున అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. సుదీర్ఘ పోరాటాల చరిత్ర ఉన్న ఏకైక యూ నియన్ ఏపీయూడబ్ల్యూజే అన్నారు. జర్నలిస్టుల హక్కుల కోసం ఏర్పాటైన ఈ యూనియన్ ఇంతింతై వటుడింతై అన్న చందంగా నేడు రాష్ట్రంలోని జర్నలిస్టులకు దిక్సూచిగా మారిందన్నారు. రాష్ట్ర ప్ర భుత్వం అనుసరిస్తున్న జర్నలిస్టు వ్యతిరేక విధా నాలకు వ్యతిరేకంగా ఎప్పటికప్పుడు ఉద్యమాలు చేసి వారికి అండగా నిలుస్తుండడం అభినందనీయం అన్నారు. జర్నలిస్టుల అక్రిడేషన్లు, ఇంటిస్థలాలు, బస్ పాస్‌లు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్‌ల కోసం ఉద్య మించి సాధించిన యూనియన్ ఏపీయూడబ్ల్యూజే అన్నారు. అలాంటి గొప్పచరిత్ర కలిగిన యూనియన్ డైరీని తన చేతుల మీదుగా ఆవిష్కరించడం గర్వంగా ఉందన్నారు. మొదటి నుంచి తాము జర్నలిస్టులకు అండగా నిలుస్తున్నమని చెప్పారు. మునుముందు కూడా ఏ సమస్య వచ్చినా అండగా నిలుస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

పోతులపాడులో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ



విశాలాంధ్ర -జూపాడుబంగ్లా: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే పేద బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గిత్త జయసూర్య అన్నారు . మంగళవారం మండలంలోని పోతులపాడు గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని గ్రామ మాజీ సర్పంచ్ రవికాంత్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం, ఇసుక ,స్కాములు చేస్తూ వైసిపి నాయకుల వారి జేబులు నింపుకుంటున్నారని వారు ఆరోపించారు. దళిత పేద విద్యార్థులను యువతను నిరుద్యోగులుగా చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తే జగన్మోహన్ రెడ్డి వారిని జైలుకు పంపించడం జగన్మోహన్ రెడ్డి నియంత్రిత్వ పాలనకు నిదర్శమని వారన్నారు. సంక్షేమం పేరుతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని తాకట్టు పెడుతుందని వారు విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం రాష్ట్రానికి చంద్రబాబు సేవలు చాలా అవసరమని వారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు ప్రజలకు న్యాయం జరుగుతుందని వారన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో గురించి ప్రజలకు చదివి వివరిస్తూ తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి చేసి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్, క్లస్టర్ కోఆర్డినేటర్ గిరీశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి, సంపత్ యాదవ్, రమణారెడ్డి, రవికుమార్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, సుధాకర్, జంగాల పెద్దన్న రామకోటి, వెంకటేశ్వర్లు, సుబ్బా రాయుడు, శంకరు, దేరంగుల శంకర్ , నరసింహులు, పెద్దన్న,సుబ్బన్న,భాస్కర్, ఎం బాస్కర్, హనుమంతు రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

విశాలాంధ్ర -కోసిగి:మండల పరిధిలోని తుంబి గనూరు సమీపానఅక్రమంగా తరలిస్తున్న కర్ణా టక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ ఎస్.మెహబూబ్ భాష, ఎస్సై రమేష్‌బాబు లు తెలిపారు. మంగళవారం ఉదయం తనిఖీ ల్లో భాగంగా దాడులు చేసి పట్టుకున్నట్లు తెలి పారు. 16 బాక్సుల్లో సుమారు రూ. 60 వేలు విలువ గల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేశామన్నారు. దొరికిన ప్రాంతంలో మద్యం తరలిస్తున్న వ్యక్తులు ఎవరు లేకపోవడంతో మద్యం బాక్సులు స్వాధీన పరుచుకుని, అనుమానం వచ్చిన ఇద్దరు వ్యక్తుల కోసం గాలి స్తున్నామన్నారు.అనుమానితులను పట్టుకుని, కేసునమోదు చేస్తా మన్నారు. ఎన్నికల నిబం ధనల మేరకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమన్నారు. సిబ్బంది ఎస్.నాగరాజు, మధు, రాముడు, నాగరాజులు తనిఖీల్లో పాల్గొన్నారు.

ఎన్నికల కేంద్రాల పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర -పాణ్యం : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్ని కలకు సంబంధించి ఈవీఎంల భద్రతారూములు, ఓట్ల లెక్కిం పు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు పరిశీలించారు. మంగళవారం మండల పరిధి లోని ఆర్జియం ఇంజనీరింగ్ కాలేజీ, శాంతిరాం ఫార్మసీ అండ్ ఇంజనీరింగ్ కాలేజీ, పట్టణంలోని సిడబ్లుసి గోడౌన్ లోని భవ నాలను జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీ, పార్ల మెంట్ నియోజకవర్గాల పోలింగ్ పిదప ఈవీఎంల భద్రతా భవనాలు, ఓట్లలెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలు పరిశీలించారు. ఒక్కో నియోజకవర్గానికి అసెంబ్లీకి రెండు భవనాలు, పార్లమెంట్ కు రెండు భవనాలు చొప్పున నాలుగు భవనాలు, ఆరు నియోజకవర్గాలకు 24 భవనాలు అవసరమవు తాయని గుర్తిం చారు. వీటితో పాటు అన్ని ని యోజక వర్గా ల పోలింగ్ సి బ్బందికి, సె క్యూరిటీ సిబ్బందికి అవసరమయ్యే భవనాలను కూడా పరి శీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.

వీరి వెంట సబ్ డివిజన్ డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్డిఓ మల్లికార్జునరెడ్డి,డి.ఎస్.ఓ.వెంకట్రాముడు, నంద్యాల, పాణ్యం తహసీల్దార్లు చంద్రశేఖర్‌రెడ్డి, ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ,ఉపాధ్యాయ డిమాండ్ల సాధన కోసం ఉద్యమిద్దాం..!

విశాలాంధ్ర– బనగానపల్లె : ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ దారుల న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం ఉమ్మడి కర్నూలు,నంద్యాల జిల్లా ఏపీఎన్జీవోస్ అధ్యక్షుడు సిహెచ్ వెంగళరెడ్డి ఆదేశాల మేరకు13 తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల తో ఏపీ జె ఏ సి ఉద్యమం చేపడుతున్నట్లు ఏపీఎన్జీవో బనగానపల్లె అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక డిగ్రీ కాలేజీ ఆవరణలో ఏపీఎన్జీవో అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు , సెక్రెటరీ ఎస్ అల్తా హుస్సేన్ ఖాన్ సెక్రెటరీ ఎస్ దాదావలి, ఉద్యోగ సంఘ నాయకుల నాయకత్వంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐఆర్, సరెండర్ లీవ్స్, జిపిఎఫెస్ ఏపీజి ఎల్ ఐ క్లెయిమ్స్, డీఏ, అరియర్స్, పీఆర్సీ అరియర్స్, మెడికల్ రిక్విర్మెంట్స్ బిల్స్ ఇచ్చే వరకు దశల వారి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 11న జరిగే రాష్ట్ర జేఏసీ లో అన్ని భాగ స్వామ్య సంఘాల ఏకాభిప్రాయంతో సమిష్టి నిర్ణయం చేసి12 న చీఫ్ సెక్రటరీకి నోటీస్ ఇస్తామన్నారు. 13 తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఉద్యమం చేస్తారన్నారు.